www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025

5

ఏలూరు



జీలుగుమిల్లిలో ప్రపంచ బ్యాంక్ బృందం పర్యటన

ఊర చెరువు ఆయకట్టు పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జీలుగుమిల్లి ఊర చెరువు ఆయకట్టును ప్రపంచ బ్యాంక్ బృందం గురువారం పరిశీలించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. ఈ ఊర చెరువు ఆయకట్టు ద్వారా 340 ఎకరాల్లో సంవత్సరానికి రెండు పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయకట్టు భూముల్లో పండుతున్న వరి, మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు, పామాయిల్ పంటలను పరిశీలించారు. అనంతరం దాట్లవారిగూడెంలోని తయారీకి సిద్ధంగా ఉన్న జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రపంచ బ్యాంక్ బృందం పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ సురేష్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉషా, వజ్రాలరాజు, రైతులు ప్రసాద్, లక్ష్మణ్, ఎఫ్‌బిఒ సభ్యులు పాల్గొన్నారు.

బిసిలకు పింఛన్ ఏదీ..!



- 50 ఏళ్లకే బిసిలకు పింఛన్ అంటూ కూటమి హామీ
- అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచినా ఉలుకుపలుకు కరువు
- ఏలూరు, పశ్చిమలో దాదాపు 20 లక్షల బిసి జనాభా
- చంద్రన్న బీమా కోసం ఐదు వేల బాధిత కుటుంబాలు ఎదురుచూపు
- 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 హామీ అమలెప్పుడో
- నిరుద్యోగ భృతిపై నోరువిప్పని అధినేతలు
- హామీల అమలు తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును పూర్తిగా మరిచిపోయిన పరిస్థితి. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో 50 ఏళ్లు నిండిన బిసిలకు పింఛన్ వర్తింపు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా బిసిలకు ఇచ్చిన పింఛన్ హామీపై మాత్రం నోరు మెదపడం లేదు. దీంతో బిసి తరగతిలో పింఛన్ అమలుపై తీవ్రమైన చర్చ సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో మొత్తం జనాభా 20 లక్షలు వరకూ ఉండగా అందులో బిసి జనాభా పది లక్షల వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అదేవిధంగా బిసి జనాభా ఉన్నారు. 2024 ఎన్నికల్లో బిసిల ఓట్లను కొల్లగొట్టేందుకు కూటమి నేతలు పలు హామీలు గుప్పించారు. 50 ఏళ్లు నిండిన బిసిలకు రూ.నాలుగు వేల పింఛన్ వర్తింపజేస్తామన్నారు. దీంతో బిసి సామాజిక తరగతి గంపగుత్తగా పెద్దఎత్తున కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసిన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను కూటమి గెలుచుకోగలిగింది. అప్పట్లో కూటమి పార్టీలు బిసిలకు ఇచ్చిన హామీని తిప్పికొట్టేందుకు వైసిపి నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో బిసి అభ్యర్థులను నిలబెట్టింది. అయినప్పటికీ బిసి తరగతి అంతా కూటమి అభ్యర్థుల వైపే మొగ్గుచూపారు. పింఛన్ పథకాన్ని మాత్రం కూటమి సర్కార్ ఇప్పటి వరకూ అమలు చేయలేదు. అందుకు సంబంధించిన ప్రక్రియను సైతం ప్రారంభించని పరిస్థితి ఉంది. ఎప్పటికి అమలు చేస్తారో తెలియని పరిస్థితి. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ పథకం అమలుపై బిసి తరగతి అంతా ఎదురుచూస్తోంది.

సామాన్యులకు అండనిచ్చే చంద్రన్న బీమా అమలుపై నిర్లక్ష్యం ★★★

ఏదైనా కుటుంబంలో ఇంటి పెద్దను కోల్పోతే చంద్రన్న బీమా అమలు చేస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. 2014 నుంచి ఈ పథకం అమల్లో ఉంది. వైసిపి ప్రభుత్వంలోనూ వైఎస్ఆర్ బీమా పథకంగా కొనసాగింది. సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రతియేటా జిల్లాలో మూడు వేలకుపైగా మరణాలు బీమా పరిధిలోకి వస్తున్నాయి. ఎన్నికల ముందు మార్చి నెల నుంచి ఈ పథకం నిలిచిపోయింది. కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత చంద్రన్న బీమా అమలు జరుగుతుందని అంతా ఆశించారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ అతీగతీ లేకుండాపోయింది. దీంతో దాదాపు ఐదువేల బాధిత కుటుంబాలు ఈ బీమా కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం చంద్రన్న బీమాను అమలు చేయాలని అంతా కోరుతున్నారు.

మహిళలకు నెలకు రూ.1500 హామీ ఏమైనట్టో..? ★★★

తాము అధికారంలోకి వస్తే 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ ఆ ఊసే లేకుండాపోయింది. రెండు జిల్లాల్లో మహిళల జనాభా 20 లక్షల వరకూ ఉంది. ఇందులో 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీపై మహిళల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పథకాలు అమలు చేస్తే జనం నమ్మే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిరుద్యోగ భృతి అమలుకు నోచుకునేనా?.. ★★★

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక యువతకు 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని, అప్పటి వరకూ రూ.మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి గురించి ప్రభుత్వం నోరు విప్పలేదు. దీంతో నిరుద్యోగ భృతి అందజేతపై యువతలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. రెండు జిల్లాల్లో నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారు. భృతి అందిస్తే నిరుద్యోగులకు కొంత ఊరటనిచ్చే అవకాశమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

24న డిప్యూటీ సిఎం పర్యటన

ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం రాక

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు



పవన్‌కళ్యాణ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఈ నెల 24వ తేదీ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం రానున్నారు. గ్రామంలో కొలువై ఉన్న స్వయంభు శ్రీ లక్ష్మినరసింహస్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. అనంతరం ఆలయ కొండపైకి వెళ్లేందుకు రూ.3.70 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను పరిశీలించనున్నట్లు తెలిసింది. జగన్నాథస్వామికి కేటాయించిన 30 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను ఆయన దేవదాయ శాఖ అధికారులకు అప్పగించనున్నారు. డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లల్లో అధికారులు నిమగ్నమయ్యారు. కొయ్యలగూడెం మండలం రాజవరం పెద్దచెరువు సమీపంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హెలీకాప్టర్ దిగిన అనంతరం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసింహస్వామి ఆలయానికి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రోడ్డుమార్గం గుండా రానున్నారు. గురువారం జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, తహశీల్దార్ జివి.సుబ్బారావు, ఎంపిడిఒ పివివి.ప్రకాష్ ఏర్పాట్లను పరిశీలించారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినదిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

హామీల అమలు కోరుతూ భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న నేతలు

కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సభల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కార్మికులను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి అధినేతలు అధికారంలోకి వచ్చాక కార్మికులను విస్మరించారని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన 1214 మెమో రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణరంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ఆరు సంవత్సరాలుగా కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, ప్రభుత్వ అవసరాలకు వాడుకున్న సంక్షేమ బోర్డు నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేయాలని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, బిల్డింగ్ యజమానుల నుంచి సెస్ వసూలు చేయాలని, 55 ఏళ్లు దాటిన నిర్మాణ కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు జి.సాంబశివరావు, కె.కొండలరావు, సిరా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించినా, చిన్న ఫిర్యాదు వచ్చినా శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య నగదురహిత సేవలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని గుర్తు చేశారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గురువారం ఎన్‌టిఆర్ వైద్య సేవలు-జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులతో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్‌పై వచ్చిన ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు. ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా 96, గుర్తించబడిన కేసులు 22, దీనికి సంబంధించిన 18, హాస్పిటల్స్‌వారీగా వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవను సక్రమంగా అమలు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆపద, అత్యవసర సమయంలో వైద్యం పొందేందుకు డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆశ్రయిస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందించడంలో ముందున్నామని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి రెండు ప్రయివేటు హాస్పిటల్స్‌పై మొదటి తప్పుగా భావించి పెనాల్టీ విధిస్తామని, ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించామని తెలిపారు. వైద్యాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో చూడాలన్నారు. వైద్య సేవలు, చికిత్స నిరాకరణ, డబ్బుల వసూలు తదితర సమస్యలు ఉన్నాయా అని రోగులను విచారించడం జరుగుతుందన్నారు. లోటుపాట్లు ఉన్నాయని చెబితే విచారణ చేసి ఆయా హాస్పిటల్స్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్పిటల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తక్షణ చర్యలు తప్పవని అన్నారు. అన్ని నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో వైద్య నిపుణులు, వైద్యులు, సిబ్బంది పేర్లు, ఫోను నెంబర్లతో సహా వివరాలను ప్రదర్శించాలన్నారు. ఏమైనా మార్పులు జరిగినా సకాలంలో తెలియజేయాలని ఆదేశించారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఉండాలని, ఏదైనా అంతరాయం ఏర్పడితే సకాలంలో సరి చేయాలని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం, డిసిహెచ్ఎస్ డాక్టర్ బి.పాల్‌సతీష్‌కుమార్, ఎన్‌టిఆర్ వైద్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.రాజీవ్, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు, ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్ వైద్యాధికారులు, ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్లు రాజ, భారతి, శ్రీను, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' కౌలు రైతులకూ వర్తింపజేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపచేయాలని సిపిఎం జిల్లా కమిటీ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ సాగులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తుందని తెలిపారు. జిల్లాలో 80 శాతం సాగులో కౌలు రైతులే ఉన్నారని, అయినా భూ యజమానులకే అన్నదాత సుఖీభవ సొమ్ములు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల సొమ్ము జమ చేసినా రూ.1.40 లక్షల మందికి పైగా ఉన్న కౌలు రైతులకు ఒక్క పైసా కూడా జమ చేయకుండా మొండి చేయి చూపించిందని పేర్కొన్నారు. సాగు చేసే రైతుకు కాకుండా వ్యాపారాలు చేసుకుంటున్న భూ యజమానుల ఖాతాల్లో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ చేయడం అన్యాయమని తెలిపారు. అక్టోబర్‌లో కౌలు రైతులకు పెట్టుబడి సాయం జమ చేస్తామని మొదటి విడత సందర్భంగా ప్రభుత్వం ప్రకటించినా రెండో విడతలోనూ కౌలు రైతులకు అన్యాయమే జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో 75 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని, 62 వేల మందికి జారీ చేసి కూడా అన్నదాత సుఖీభవ సొమ్ములను ప్రభుత్వం కౌలు రైతులకు అందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం, బీమా, పంట నష్టపరిహారంతో సహా భూ యజమానులకే ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేసి పంట నష్టపరిహారాన్ని అందించాలని పేర్కొన్నారు.

మొక్కజొన్న విత్తన పంట బకాయిలు ఇవ్వకపోతే..

ఆత్మహత్యలే శరణ్యం

రెండో రోజు దీక్షల్లో మొక్కజొన్న విత్తన రైతుల ఆవేదన

మొక్కజొన్న విత్తన రైతులకు న్యాయం చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



నినదిస్తున్న రైతులు, నేతలు

మొక్కజొన్న విత్తన పంట బకాయిలు సీడ్ ఆర్గనైజర్ వెంటనే చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటూ మొక్కజొన్న విత్తన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పంగిడి గూడెం శివారు హనుమాన్‌గూడెంలో మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ చిలక అప్పారావు ఇంటి ముందు ఎపి రైతుసంఘం, ఎపి విత్తన రైతుల సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులు రెండో రోజు గురువారం రిలే దీక్షలు నిర్వహించారు. 'మా విత్తన సొమ్ము.. మాకు వెంటనే ఇవ్వాలి' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కజొ న్న సీడ్ ఆర్గనైజర్ నుండి రైతులు ఇవ్వాల్సిన మొక్క జొన్న విత్తన పంట బకాయిలు రూ.18.65 లక్షలు వెంటనే రైతులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు నెలలుగా బాధిత రైతులు తిరుగుతున్నా బకాయిలు ఇప్పించి న్యాయం చేయకపోవడం దారుణమని విమర్శించారు. ఏమీ చేయలేమని అధికారులు, పోలీసులు చేతులెత్తేయడం తగదన్నారు. మొక్కజొన్న విత్తన రైతులను మోసగించిన సీడ్ ఆర్గనైజర్ నుండి మోసపోయిన రైతులకు సొమ్ములు ఇప్పించేలా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కష్టపడి అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంట పండించి ఆర్గనైజర్‌కు అప్ప గిస్తే కంపెనీల నుండి సీడ్ డబ్బులు తెచ్చుకుని రైతుల కు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతూ మోసగించిన ఆర్గనైజర్‌ను తక్షణమే అరెస్టు చేసి, చీటింగ్ కేసులు బనాయించి రైతులకు సొమ్ములిప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి అవసరమైతే అతని ఆస్తులు జప్తు చేసి మొక్కజొన్న విత్తన రైతులకు సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, మండల కార్యదర్శి గుర్రం రాంబాబు మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదన్నారు. ఈ రిలే దీక్షల్లో బాధిత రైతులు వీరవల్లి శివనాగరాజు, వీరవల్లి మోహన్‌రావు, వీరవల్లి నాగ వెంకట్రావు, వీరవల్లి నాగరాజు, వీరవల్లి నాగేంద్రం, గుర్రం పాపారావు, కంచిపెట్టి రాజు, చిలక సూరయ్య పాల్గొన్నారు.

త్వరలో జాతీయ రహదారి అభివృద్ధి పనులు పూర్తి

ఎన్‌హెచ్ డిఇ సత్యనారాయణ

ప్రజాశక్తి - మండవల్లి



మాట్లాడుతున్న డిఇ సత్యనారాయణ

జాతీయ రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఎన్‌హెచ్ డిఇ సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి పామర్రు దిగుమూరు 165 మండవల్లి వద్ద నిలిచిపోయిన అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై ప్రజాశక్తి నాణ్యత లోపాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చింది. జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్వహిస్తున్న పనులు నాసిరకంగా నిర్వహిస్తున్నారని, దీంతో వేసిన రహదారి అనతి కాలంలోనే ధ్వంసం అయిపోయిందని ఆయన దృష్టికి తీసుకొచ్చింది. డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా నిర్వహించకపోవడంతో వర్షం కురిసినప్పుడు రహదారిపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వ ఉంటుందని ఆయనకు తెలిపింది. స్టేషన్ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించలేదని, దీంతో గ్రామంలోని మురుగునూరు వెళ్లేందుకు ఆటంకంగా ఉందని, ఆ రోడ్డులో మురుగునీరు పోయేలా కల్వర్టు నిర్మించాలని ఆయనకు సూచించింది. అంతేకాకుండా విద్యుత్ దీపాలు లేకపోవడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించింది. దీనిపై ఎన్‌హెచ్ డిఇ సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాల కారణంగా పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనన్నారు. ప్రస్తుతం శీతాకాలం రావడంతో పనులను తిరిగి ప్రారంభించామని, త్వరితగతిన పూర్తి చేసి రహదారిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అంతేకాకుండా రహదారి నిర్మాణంలో నాణ్యత లోపం లేకుండా, రహదారి నిర్మించిన అనంతరం విద్యుత్ దీపాలు నిర్మించేలా తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు ఎన్‌హెచ్ ఎఇ శరత్ భానుప్రసాద్, తదితరులు ఉన్నారు.

అంకితభావంతో విద్యాబోధన చేయాలి

మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు

విద్యా విధానంలో వస్తున్న నూతన ఒరవడులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన చేయాలని మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. మండల పరిధిలోని యుటిఎఫ్ భవనంలో నిర్వహించిన యుటిఎఫ్ మండల కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు. ఈ ఎన్నికలకు పంతగాని వీర కోటి ఎన్నికల అధికారిగా, బి.అనురాధ పరిశీలకులుగా వ్యవహరించారు. యుటిఎఫ్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.రామచంద్రన్, కె.అజరయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా బి.ఏసేపు, సహ అధ్యక్షులుగా ఎ.మాధవి, సిహెచ్.అంజనాదేవి, మండల కార్యదర్శులుగా నాగమణి, గ్రేస్ మేరీ, సుదర్శన్, సీతారత్నం, రమేష్‌బాబు, గోపాలరావు, రాకేష్, వెంకటలక్ష్మి, వెంకటనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా అరుణ, వెంకటేశ్వరరావు, కృష్ణ, జయకుమార్, వెంకటరెడ్డి, వీరస్వామి ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్ కామ్రేడ్ సత్తు కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి మనోహర్ కుమార్, సిఐటియు నాయకులు జి.రాజు, గ్రామ ప్రముఖులు పి.రవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వ్యాపారాలతో సహకార సంఘాలు బలోపేతం

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ సిఇఒ జి.భుజంగరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం



జెండా ఆవిష్కరిస్తున్న భుజంగరావు

నూతన వ్యాపారాలు చేపట్టడం ద్వారా సహకార సంఘాలు బలోపేతం అవుతున్నాయని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ సిఇఒ జి.భుజంగరావు అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో గురువారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా భుజంగరావు సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. రైతులు సొసైటీలు అందిస్తున్న సేవలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సొసైటీలు రైతులకు రుణాలు అందించడంతో పాటు పలు రకాల వ్యాపారాలతో రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం సొసైటీ పరిధిలోని మండలంలోని ఎపిగుంట, మధ్యాహ్నపువారిగూడెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంలో నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొని ఫిర్యాదులు స్వీకరిస్తారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు కొన్నంగుంట రోడ్డులోని మాగంటి రవీంద్రనాథ్ ఠాగూర్ తోటలో జరిగే పార్టీ మండలాధ్యక్షులు, గ్రామ అధ్యక్షుల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొంటారు.

అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేద ప్రజల భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం ఎసైన్మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద గురువారం సిపిఎం మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం కమిటీ సభ్యులు బరగడ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అసైన్మెంట్ చట్టాన్ని ఫ్రీ హోల్డ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. మరోపక్క స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేసే కుట్రలో భాగంగా చంద్రబాబు ఇస్తాసునారాం మాట్లాడటం సరికాదన్నారు. అసైన్డ్ చట్టాన్ని ఫ్రీ హోల్డ్ చేయడం రద్దుచేయాలని, 19/77 చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గుంజిల్లి వెంకట్రావు, మండల కార్యదర్శి మడకం సుధారాణి, శిరిష, బుద్ధుల గంగాభవాని, కాక శర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'క్లీన్ అండ్ గ్రీన్'

ప్రజాశక్తి - భీమడోలు

స్వయం సహాయక సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ సహాయకులు, డ్వాక్రా సభ్యులు ప్రస్తుతం నిర్వహిస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ అవగాహన కార్యక్రమాల ద్వారా పూర్తిస్థాయిలో చైతన్యవంతులై గ్రామస్థాయిలో కార్యక్రమాలు విజయవంతం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి కోరారు. ఫీవ్-5లో భాగంగా భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ అవగాహన కార్యక్రమాలు గురువారం రెండో రోజుకు చేరాయి. రెండవ రోజు కార్యక్రమాన్ని స్వయం సహాయక సంఘ సభ్యులకు, గ్రామ ఆర్గనైజేషన్ సహాయకులకు ప్రత్యేకించారు. కార్యక్రమాన్ని మండల పరిషత్ పరిపాలన అధికారి శర్మ ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్గా భీమడోలు ఎంపిడిఓ వ్యవహరించారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి తదుపరి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ప్రతి గ్రామపంచాయతీ నుండి ఇద్దరు ఎస్హెచ్జి (స్వయంసహాయక బృందం) సభ్యులు, ఇద్దరు విఒఎలు ఈ ప్రత్యేక శిక్షణకు అందిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపే విధానాలు, వ్యర్థాలను వర్గీకరించే పద్ధతులు, ఇంటి వద్ద నుంచే పరిసరాల సంరక్షణలో తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలను నిపుణులు వివరించారు.

ఉపాధ్యాయుల శ్రేయస్సే ఎపిటిఎఫ్ ధ్యేయం

జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, వారి అభ్యున్నతికి ఎపిటిఎఫ్ ఎప్పుడూ ముందుంటుందని సంఘ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సంఘం మండలాధ్యక్షులు ఎ.క్రుపాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సేవ దరఖాస్తు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ముదినేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల చిత్తశుద్ధి తో ముందుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నారాయణ దాసు, జయ శ్రీలత, చక్రధర్, రామరాజు, సుబ్రహ్మణ్యం, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

పశు పోషకులకు అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పశు పోషకులు మెలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక పాల దిగుబడులను సాధించడంతో పాటు పశువులకు వచ్చే వ్యాధుల నుండి సంరక్షించవచ్చునని నూజివీడు ఉప సంచాలకులు జి.రమేష్ అన్నారు. మండల పరిధిలోని నూగొండపల్లిలో పశు పోషణ పట్ల చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులు తీసుకోవాల్సిన చర్యల గురించి పశుపోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కందుల మల్లేశ్వరి, సహాయ సంచాలకులు కె.నరసింహారావు, హరిత, ఆగిరిపల్లి పశు వైద్యాధికారి సిహెచ్.హనుమంతరావు, గ్రామ ప్రముఖులు కందుల వెంకటేశ్వరరావు(విక్రమ్), పశు పోషకులు పాల్గొన్నారు.



మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్న రమేష్

నేరాలు – ఘోరాలు

బైక్ చోరులు అరెస్టు

ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - మండవల్లి

మోటార్ సైకిల్ దొంగలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి ఐదు బైక్లను స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి పోలీస్ స్టేషన్లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ వివరాలను వెల్లడించారు. పల్నాడు జిల్లా బొల్లపల్లి మండలం గంగుపల్లి తండాకు చెందిన రామావత్ దుర్గాప్రసాద్ నాయక్, సీతారాంపురం తండాకు చెందిన బనావత్ తులసి బాబు నాయక్తో పాటు గంగుపల్లి తండాకు చెందిన మరో బాలుడు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. మండవల్లి మండలం మణుగూరులో సెప్టెంబర్ ఒకటో తేదీన మూడు బైకులను, చావలిపాడులో ఒక బైక్ చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ మండవల్లి నుంచి విజయవాడ వరకు ఉన్న సీసీ ఫుటేజ్లను పరిశీలించారు. కొవ్వాడలంక గ్రామ పరిధిలోని ఒక డొంక వద్ద నిర్వహించిన ఆపరేషన్లో ఒక మోటార్ సైకిల్తో పాటు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారికి పూర్తిస్థాయిలో విచారించగా మణుగూరు చావలపాడులో దొంగతనానికి పాల్పడినవారు వీరే అని నిర్ధారించారు. మణుగూరులో, లోకముడిలో అపహరించిన వాహనాలతో పాటు ఏలూరుకు చెందిన మరొక వాహనంతో కలిపి మొత్తం ఐదు వాహనాలను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి తరలిస్తామని సిఐ తెలిపారు.

1500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం డిఎస్పి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కుక్కునూరు సిఐ ఎం.రమేష్బాబు ఆధ్వర్యంలో మండలంలోని వేలేరు గ్రామ శివారు పాములేరు వాగు సమీపంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్ఐ రాజారెడ్డి నేతత్వంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. ఈ దాడిలో సారా కాచే బట్టీలు, పాత్రలను, 1,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఉన్న వస్తువులు అగ్నికి ఆహుతి అయిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ముదినేపల్లికి చెందిన జి.చిన్ని ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు కాలి బుడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యువతిని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములగలంపల్లి గ్రామానికి చెందిన డి.విష్ణు గ్రామానికి చెందిన ఓ యువతిని గత కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో శారీరకంగా లోబర్చుకున్నాడు. యువతి పెళ్లి చేసుకోమని అడిగితే ముఖం చాటేచాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చలికాలంలో మూగజీవాల సంరక్షణ తప్పనిసరి

పశుసంవర్థక శాఖ ఏడిఏ డాక్టర్ డి.వరప్రసాద్



చిట్ చాట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మూగజీవాలకు చలికాలంలో సరైన సంరక్షణ చేపట్టాలని మండవల్లి పశు సంవర్థక శాఖ ఎడిఎ డాక్టర్ డి.వరప్రసాద్ అన్నారు. గురువారం ముదినేపల్లిలో ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అయన మాట్లాడారు. గ్రామాల్లోని పశుయజమానులు లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల మేలు జాతి లేగదూడలు పుడతాయన్నారు. పుట్టిన వెంటనే లేగదూడలకు నెలలోపు నట్టల నివారణ మందులను క్రమం తప్పకుండా మూడు సార్లు వేయడం వల్ల ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటాయని తెలిపారు.

ప్రశ్న : చలికాలంలో లేగదూడల రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎడిఎ : దూడలను చల్లటి గాలులు లేని షెడ్డులో ఉంచాలి. షెడ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నేలపై గోనెసంచులు, రబ్బరు మ్యాట్లు, వేడిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయంలో గాలి తగిలేలా చూడాలి.

ప్రశ్న : దూడ పుట్టినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎడిఎ : దూడ పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాలు, నోటి నుంచి వచ్చే జిగురు తుడిచి శుభ్రం చేయాలి. బొడ్డు కత్తిరించిన తర్వాత అయోడిన్ ద్రావణాన్ని పూయాలి. అర్ధగంట లోపు జున్నుపాలు తాగించడంతో రోగనిరోధక శక్తి పెరిగి మలబద్దక సమస్యను నివారించవచ్చు.

ప్రశ్న : మిని గోకులం షెడ్లు ఎన్ని మంజూరయ్యాయి?

ఎడిఎ : 90 శాతం రాయితీతో పది శాతం రైతు కాంట్రిబ్యూషన్తో మినిగోకులం షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. మండవల్లి మండలంలో 25, ముదినేపల్లి మండలాల్లో 25 మిని గోకులం షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి.

ప్రశ్న : గ్రామాల్లో ఎటువంటి పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు?

ఎడిఎ : రాష్ట్రీయ గోకులం మిషన్ ద్వారా ప్రతి మండలంలో ఒక పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఎదకు రాని పశువులకు, తిరగబడుతున్న, గర్భకోశ పశువులకు చికిత్స నిమిత్తం ప్రతి క్యాపునకు రూ.20 వేల మందులను సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న : పశువుల దాణా రాయితీపై అందిస్తున్నారా?

ఎడిఎ : ముదినేపల్లి మండలానికి మొదటి విడతగా పన్నెండున్నర మెట్రిక్ టన్నులు, రెండో విడతలో ఎనిమిది మెట్రిక్ టన్నుల దాణా సరఫరా చేస్తాం. 50 కిలోల దాణా రూ.1,110 ఉండగా 50 శాతం రాయితీ పోను రూ.555 మాత్రమే తెల్ల రేషన్కార్డు కలిగిన పశు పోషకులు చెల్లించాలి.

ప్రశ్న : శిథిలావస్థకు చేరిన పశు వైద్య కేంద్రాలకు ప్రతిపాదనలు చేశారా?

ఎడిఎ : మండలంలో పెదపాలపర్రు, పెదగొన్నూరు, చిగురుకోట పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. పెదపాలపర్రు పశువైద్య కేంద్రానికి రూ.45 లక్షలు, చిగురుకోటకు రూ.45 లక్షలు, పెదగొన్నూరు వెటర్నరీ డిస్పెన్సరీకి రూ. 60 లక్షల ప్రతిపాదనలు పంపాం.

ప్రశ : పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందా?

ఎడిఎ : పెదగొన్నూరు, పొద్దువాక, చిగురుకోట, వాడవల్లి, పెదపాలపర్రు పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. డిసెంబర్ లోగా సిబ్బంది నియామకం జరుగుతుంది. చిగురుకోట, వాడవల్లి, పెదపాలపర్రు గ్రామీణ పశు వైద్యశాలల్లో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసిన సందర్భంగా ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డిఒ అచ్యుత అంబరీష్, ఎఎస్పి ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఏలూరు బాలల గ్రంథాలయంలో ముగింపు, బహుమతి ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హాజరై మాట్లాడారు. బాలల గ్రంథాలయంలో చదివి వివిధ ఉద్యోగాలకు ఎంపికైన సుమారు పదిమందిని సన్మానించారు. అనంతరం విద్యార్థులతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించి వివిధ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చే పాఠకులు నరసింహారావును సత్కరించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు మణిపూరి శోభ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన ముగ్గురిని సన్మానించినట్లు శాఖా గ్రందాలయాధికారి జె.రమేష్బాబు తెలిపారు.

భీమడోలు :మండలంలోని పూళ్ల, భీమడోలు శాఖ గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథ పాలకులు అమర్నాథ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ రెండు చోట్ల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్లు తోట పెదబాబు, టివి.ఉమామహేశ్వరరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆధ్వర్యంలో సభ్యులు వారోత్సవాలు విజయవంతం కావటానికి తమ వంతు సహకారాలను అందించారు.

నూజివీడు టౌన్ :నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వారం రోజుల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు.

ఏలూరు సిటీ : సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ పుప్పాల వీరభద్రరావు మాట్లాడారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు.

పెదపాడు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే డిజిటల్ గ్రంథాలయాల వినియోగంపై ఓరియంటేషన్, స్వీయ పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభ బహుమతుల ప్రదాన ఉత్సవానికి ముఖ్య అతిథులుగా పలువురు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఉపసర్పంచి ఈడే సుధాకర్, బిజెపి నాయకులు కోటప్రోలు కృష్ణ, కొత్తూరు వెంకట సుబ్బారావు విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.

కామవరపుకోట :గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని శాఖ గ్రంథాలయ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం బుర్రకథ కళాకారులు వీరమళ్ల సత్యనారాయణ, చిలుకూరి సుబ్బయ్యచారి, టివిఎస్.రాజులను అభివృద్ధి కమిటీ వారు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండూరు రామకృష్ణ, ప్రభాకర్, బొల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో పలు పోటీల్లో విజేతలైన వారికి ఇచ్చే బహుమతుల కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు పిన్ని వీరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 40 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్ బాబు, ఎంఇఒ-2 కె.ఆనంద్కుమార్, జెడ్పిహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, గ్రామ ప్రముఖులు జయరాజు, సీతయ్య, గ్రంథాలయాధికారి కుమార్ పాల్గొన్నారు.

మండవల్లి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కార్యదర్శులు గిరిజ కొండలు స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, లైబ్రరీ అధికారి విజయకుమారి, గ్రంథాలయ అధికారిని షేక్ పరివీణ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

'శ్రీశారద' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కుంచనపల్లిలో జరిగిన ఎస్జిఎఫ్ అండర్ -14 క్రికెట్ సెలెక్షన్స్లో కృష్ణా జిల్లా క్రికెట్ జట్టుకు శ్రీ శారద స్కూలు విద్యార్థి ఎం.రాజా విగ్నేష్ ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.ఇజ్రాయెల్ తెలిపారు. పాఠశాల ఛైర్మన్ కుప్పాల శంకర్, కరెస్పాండెంట్ రాధిక, ఉపాధ్యాయులు రాజా విగ్నేష్ను, వ్యాయమ ఉపాధ్యాయుడు ఆదర్శ్ బాబును అభినందించారు.

ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణశేషసాయి

నూజివీడు టౌన్ : పట్టణానికి చెందిన పోలుకొండ కృష్ణ శేషసాయి ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలు విద్యాసంస్థల అధినేతలు, పలువురు సామాజికవేత్తలు, పలు ప్రజాసంఘాల నాయకులు అభినందించారు. ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న సెయింట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థి కృష్ణ శేష సాయి ఫెన్సింగ్ క్రీడలో అత్యుత్తమ ప్రగతి సాధించాడు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని కెబిసి జెడ్పి హై స్కూల్ ఆవరణలో బుధవారం రాత్రి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 17 సేబర్ విభాగంలో కృష్ణ శేష సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొదటి క్రీడాకారునిగా ఎంపికయ్యాడు.

బాలల హక్కులపై అవగాహన

ముదినేపల్లి :గ్రామ స్థాయిలో బాలల హక్కులు, వారి రక్షణ, సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని ముదినేపల్లి, వడాలి సెక్టర్ సూపర్వైజర్లు జి.కరుణ, పి.విజయలక్ష్మి తెలిపారు. కోడూరు, పెయ్యేరు గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో బాలల హక్కులపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో గర్భిణులు, బాలింతలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, బాలలు పాల్గొన్నారు.

ఇ-ప్యాక్స్ విధానంతో రైతులకు మేలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



మాట్లాడుతున్న రవికుమార్

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో దేశంలో తొలిసారిగా ఇ- ప్యాక్స్ అనే విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత మన ఆంధ్రప్రదేశ్దేనని, ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తవ్వడానికి ఉద్యోగ వ్యవస్థలో యువతరం పాత్ర శ్లాఘనీయమని నూజివీడు విభాగ సహకార అధికారి మరీదు రవికుమార్ తెలిపారు. నూజివీడు సహకార సంఘం ఆవరణలో గురువారం 72వ అఖిలభారత సహకార వారోత్సవాల ముగింపు రోజు సందర్భంగా సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంఘ సిఇఒ నీలం నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిఆర్ మరీదు రవికుమార్ మాట్లాడుతూ సహకార సంఘాల్లో రైతుల ఆర్థిక లావాదేవీలను ఒకేరోజులో సులభంగా, పారదర్శకంగా నమోదు చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచే దిశలో సహకార సంఘాల్లో ఇ-ప్యాక్స్ విధానం రైతులకు ఎంతో మేలు అన్నారు. రోజువారి లావాదేవీలను డిజిటల్ వేదికపై నమోదు చేయడం ద్వారా రైతులకు సులభమైన బ్యాంకింగ్ సేవలను అందించడమే కాకుండా సహకార సంఘాలపై సభ్యుల విశ్వాసాన్ని మరింత పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు కెడిసిసి బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రభాకర్, సూపర్వైజర్ ఎంజె.ఏసుదాసు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కినేని ఆంజనేయ ప్రసాద్ (రాజా), ఏలూరు జిల్లా ప్యాక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు కుంగ్ఫూ, కరాటే శిక్షణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల స్వీయరక్షణ నైపుణ్యాల పెంపునకు కుంగ్ఫూ, కరాటే శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రధాన ఉపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కరాటే ట్రైనర్ టి.తమన్నదొర ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతిరోజూ సాయంత్రం ఒక గంట పాటు ప్రాక్టీస్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ తెలిపారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రతపై నిర్వహించిన శిక్షణాకార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జెవి.రమణమ్మ, పంచాయతీ రాజ్ ఎఇ సంపత్ కుమారి, ఎపిఎం టి.నాగభూషణం, టిఒటి శ్రీహరి, వెలుగు సిబ్బంది, ఎస్హెచ్జి సభ్యులు, విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని బొందిలిపేటలో శ్రీ గంగానమ్మ తల్లి ఆలయం సమీపంలో ఉన్న ఎంపి ఎలమెంటరీ పాఠశాలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలోని మహిళలు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా స్వల్ప కాలిక రుణాలను వడ్డీ రహితంగా ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధిలో గ్రూపులకు చెందిన మహిళలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పి అనిత, సిఎల్ఆర్పి తులసిలక్ష్మి, గ్రూపులకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు, కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్వశక్తితో ఎదగాలనుకునే వారికి చేయూతనందించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరులో తన సొంత నిధులతో పాటు దాతల సహకారంతో సమకూర్చిన తోపుడు బండ్లు, ట్రైసైకిల్, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక చేసిన అర్హులకు ఏడు తోపుడు బండ్లు, ఒక కుట్టు మిషన్, ఒక ట్రైసైకిల్ను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

కాటాలకు సీల్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఉన్న చౌక దుకాణాల వెరిఫికేషన్ తూనికలు కొలతల అధికారులు గురువారం నిర్వహించారు. కాటాలకు సీల్ వేసే కార్యక్రమాన్ని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో 39 చౌక దుకాణాలున్నాయి. చౌక దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ వేశారు. ఈ సందర్భంగా నూజివీడు డివిజన్ తూనికలు కొలతల అధికారి సిహెచ్.వాసుదేవరావు మాట్లాడుతూ నూజివీడు డివిజన్లో ఇప్పటికే కైకలూరు, కలిదిండి మండలాల్లో కాటాలకు సీల్ వేసే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతల అసిస్టెంట్ ఎండి సజ్జాతా అలీ, చౌక డిపో డీలర్లు పాల్గొన్నారు.